

దివ్యాంగులకు సమాన..

దివ్యాంగ విద్యార్థులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉంటాయని జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ పేర్కొన్నారు.

- 8లో ▸



పట్టు పట్టి పీహెచ్‌డీ..

కుటుంబ బాధ్యతలు మోస్తూ.. మరోవైపు ఉద్యోగం చేస్తూ.. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మహిళలు పీహెచ్‌డీ సాధించారు.

- 8 లో ▸

గరిష్టం/కనిష్టం

35.1/21.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సాగర్' గేట్లు మూసివేత



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో శనివారం మధ్యాహ్నం నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసి వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈనెల 18 నుంచి శనివారం ఉదయం వరకు ఆరు రోజుల పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రం 13,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,404 అడుగుల (16.357 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

అవినీతిపై ఆరా

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో అవినీతి వ్యవహారంపై ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. 'విద్యాశాఖలో ఏసీబీ గుబులు' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఏసీబీ అధికారులు కేజీబీవీల్లో ఇటీవల జరిగిన నిధుల ఖర్చుల, లర్నింగ్ మెటీరియల్, నోట్ పుస్తకాల పంపిణీపై ఆరా తీస్తున్నారు. ఎవరైనా అధికారులు మీ నుంచి డబ్బులు వసూలు చేశారా? అని కేజీబీవీ ప్రత్యేకాధికారులను ఫోన్‌లో ప్రశ్నించారు. మాక్లూర్ కేజీబీలో భారీగా అవినీతి జరిగినట్లు కొంతమంది ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే వేసవి శిక్షణకుసంబంధించిన నిధులు కాజేసిన వ్యవహారంపై ఏసీబీ విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా 'సాక్షి' కథనంపై స్పందించిన విద్యాశాఖ అధికారులు నిధులు సక్రమంగానే వినియోగించినట్లు పేర్కొన్నారు. కో ఆర్డినేటర్ల బిల్లుల మేరకే నిధులు విడుదల చేశామని డీఈవో అశోక్ ప్రకటనలో తెలిపారు.

ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల బ్యాగులపై ఉన్న ధరలు, ప్యాకింగ్ తేదీలతో పాటు ఇతర వివరాలను పరిశీలించారు. లీగల్ మెట్రాలజీ నిబంధనల ప్రకారం లేని ఎరువుల ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మూడు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ తూనికల కొలతల అధికారి సందీప్ మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మూడు దుకాణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎంసీ వద్ద ఉద్రిక్తత



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి వద్ద శని వారం ఉద్రిక్తత నెలకొంది. సీఎంసీ చైర్మన్ హోదాలో వచ్చిన షణ్ముక మహాలింగంను సెక్యూరిటీ సిబ్బంది శనివారం లోనికి రాకుండా అడ్డుకున్నారు. మెయిన్ గేటుకు తాళం వేసి ఉండటంతో తెరవాలని మహాలింగం చెప్పినా సెక్యూరిటీ పట్టించుకోలేదు. డైరెక్టర్ డాక్టర్ అజ్జ శ్రీనివాస్, చైర్మన్ షణ్ముక మహాలింగం మధ్య గత కొన్ని రోజులుగా సీఎంసీ నిర్వహణపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. అజ్జ శ్రీనివాస్‌ను డైరెక్టర్‌గా తొలగించి కొత్త డైరెక్టర్‌గా జేఎస్ రావును నియమించినట్లు షణ్ముక లింగం కొద్ది రోజుల క్రితం తెలిపారు. అయినప్పటికీ అజ్జ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెక్యూరిటీ సిబ్బంది షణ్ముక మహాలింగంను లోనికి అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన మహాలింగం గేటు తాళాలు పగులగొట్టి లోనికి వెళ్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఎండీ షరీఫ్ సిబ్బందితో సీఎంసీ వద్దకు చేరుకున్నారు. మహాలింగంతోపాటు జేఎస్ రావును స్టేషన్‌కు తరలించారు. సీఎస్ఐ మెడికల్ ట్రస్ట్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నందున వారిని ఇక్కడికి పిలిపించాలని, అప్పుడే ఎవరు సీఎంసీకి బాధ్యులో తేలుతుందని అంతవరకు ఎలాంటి గొడవలు చేయవద్దని ఎస్సై సూచించారు. ఈ సందర్భంగా మహాలింగం మాట్లాడుతూ.. అజ్జ శ్రీనివాస్ నేపాల్ దేశ డూప్లికేట్ సర్టిఫికెట్లతో డాక్టర్‌గా కొనసాగుతున్నారని, సీఎంసీ విషయంలో లీగల్‌గా తేల్చుకుంటానన్నారు.

ఫౌండేషన్ రుణం తీర్చుకోలేనిది



నాది గంగాసముందర్. తొండాకూర్‌లో కారోబార్‌గా పని చేస్తా. ఇటీవల నా కొడుకు ఆరోగ్యం బాగోలేకపోతే 'హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు మరిచి పోలేని సాయం చేశారు. పొరుగు ఊరని చూడకుండా రూ.2లక్షలకు పైనే ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆ డబ్బులు నా కొడుకు వైద్యానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఏం చేసినా వారి రుణం తీర్చుకోలేను. – మోతె అశోక్, గంగాసముందర్



సండే స్పెషల్



ఊరు చాలా ఇచ్చింది.. ఎంతో కొంత తిరిగిచ్చేయాలి..

అంటూ శ్రీమంతుడు సినిమాలో హీరో మహేశ్‌బాబు చెప్పిన డైలాగ్‌ను నిజ జీవితంలో ఆచరిస్తున్నారు డొంకేశ్వర్ మండలంలోని తొండాకూర్ గ్రామస్తులు. ఆపదలో ఎవరున్నా ఊరంతా ఒక్కటై అండగా నిలుస్తున్నారు. ఊరు విడిచి ఎక్కడెక్కడో ఉంటున్న వారు సైతం 'ఎక్కడి నుంచి వచ్చామో మరిచిపోకూడదు' అంటూ గ్రామంతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారు. తొండాకూర్ గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సేవలపై 'సాక్షి' సండే స్పెషల్..

తొండాకూర్ శ్రీమంతులు

■ ఆపద ఎవరికొచ్చినా ముందుంటున్నారు ■ 2019లో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఏర్పాటు ■ పక్క గ్రామాల వారికీ ఆర్థికసాయం

డొంకేశ్వర్(ఆర్మూర్): పక్కోడు బాగుపడితే ఓర్వలేని ఈ కాలంలో.. గ్రామంలో ఏ ఒక్కరికీ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నారు. మండలంలోని తొండాకూర్ గ్రామస్తులు. కొంతమంది వ్యక్తులు ఫౌండేషన్‌గా ఏర్పడి ఊరిలో ఏ పేదకు కష్టమొచ్చినా ఆదుకుంటున్నారు. అనుకోని ఆపద వస్తే మేమున్నామంటూ వెంటనే ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవితానికి భరోసా ఇస్తున్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని వారికి రూ.లక్షల్లో సాయమందించి ప్రాణాలను సైతం నిలుపుతున్నారు. కులమతాలకు అతీతంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నారు. 15 మందితో 2015లో ఏర్పాటైన గ్రూపు 2019 సెప్టెంబర్‌లో ఫౌండేషన్‌గా మారింది. ప్రస్తుతం 224మంది సభ్యులు ఉండగా, ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, విదేశాలకు వెళ్లిన వారున్నారు. ప్రారంభంలో నెలకు రూ.100 చొప్పున నిధులు జమ చేయగా, ఇప్పుడు ఆపద సమయాల్లో అడిగిన వెంటనే ఆలోచించకుండా రూ.వేలల్లో ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. గ్రామానికి చెందిన వారికే కాకుండా పక్క గ్రామాల పేదలకూ సాయం చేస్తూ 'హెల్పింగ్ హ్యాండ్స్' ఫౌండేషన్ ఆదర్శంగా నిలుస్తోంది. మున్ముందు పేద విద్యార్థుల చదువులకు కూడా తోడ్పాటునందించాలని సభ్యులు భావిస్తున్నారు.



ఫౌండేషన్ అందించిన సేవల్లో కొన్ని

- గ్రామానికి చెందిన బొగ్గుల సాగర్ 2023లో దుబాయ్‌లో మరణించగా, ఆయన మృతదేహాన్ని ఇంటికి రప్పించేందుకు తెచ్చేందుకు కృషి చేయడంతోపాటు బాధిత కుటుంబానికి రూ.1.75 లక్షల సాయం.
- 2024 డిసెంబర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ బండి రాజన్న భార్య లావణ్య అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబానికి రూ.1.44 లక్షల ఆర్థిక సాయం.
- 2025 ఫిబ్రవరిలో బోదాసు నడ్పి గంగాధర్ భార్య పోసాని అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ పోషణ కోసం గంగాదర్‌కు రూ.13,300 అందజేశారు.
- 2025 మార్చిలో ఐదో తరగతి చదువుతున్న దండుగుల శ్యామ్ ఇంట్లో పాముకాటుతో మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు చనిపోయి దుఖంలో ఉన్న తల్లి సునీతకు రూ.26,300 అందజేశారు.
- గంగాసముందర్ గ్రామానికి చెందిన మోతె అశోక్ తొండాకూర్ గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. ఆయన కొడుకు అనారోగ్యం బారిన పడడంతో వైద్యం చేయించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఫౌండేషన్ ద్వారా విరాళాలు సేకరించి అశోక్‌కు రూ.2లక్షల వరకు అందించారు.
- తొండాకూర్ గ్రామానికి చెందిన అవుట్ల నరేశ్ 2025 జూలైలో ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి మరణించాడు. పెద్ద దిక్కును కోల్పోయిన నరేశ్ కుటుంబానికి రూ.1.29 లక్షలు అందజేశారు.
- కుల, మతాల బేధాలు లేవని చాటి చెప్పేందుకు గ్రామానికి చెందిన షేక్ కలీం పాషా దుబాయ్ నుంచి రూ.30వేలు, రూ.10వేలు వేర్వేరు సందర్భాల్లో ఫౌండేషన్‌కు అందజేశారు.



ఓ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

భేదాలు ఉండవు



కుల, మతం భేదాలు లేకుండా బాధితులు ఎవరైనా ఆర్థిక సాయం చేయడమే ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. అత్యవసర పరిస్థితి ఉంటే పక్క గ్రామాలకు చెందిన వారికి కూడా సాయం చేస్తున్నాం. విదేశాల్లో ఉన్న వారు కూడా డబ్బులు పంపుతారు. కలిసి కట్టుగా ఇదే విధంగా ముందుకు సాగుతాం.

– గజ్జల సతీశ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు



బాలుడి వైద్యం కోసం రూ.30వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న ఓ కుటుంబం

అందరి సహకారంతో..



గ్రామంలో పేదలకు అనుకోని కష్టం వస్తే ఆదుకోవాలనే ఆలోచన వచ్చింది. నా ఆలోచనకు అందరి సహకారం తోడైంది. ఏడేళ్ల క్రితం ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్నాం. 250మంది వరకు సభ్యులుగా ఉన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడానికి స్థోమతను బట్టి డబ్బులు కూడబెట్టి అందజేస్తున్నాం. భవిష్యత్‌లో పేద విద్యార్థుల చదువులకు సహకారం అందించాలని భావిస్తున్నాం.

– కురుమ దేవన్న, మాజీ సర్పంచ్, తొండాకూర్

మానవ సేవతోనే సంతృప్తి



కష్టాల్లో ఉన్న పేదలకు సేవ చేయాలనే తపన ఎప్పట్నుంచో ఉంది. మనిషికి మనిషి తోడు ఉంటేనే మానవ సేవ సార్థకం అవుతుంది. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ద్వారా ఊరి పేదలను ఆదపలో ఆదుకుంటున్నాం. ఇది ఎంతో సంతృప్తినిస్తుంది. రానున్న రోజుల్లో ఫౌండేషన్‌ను బరింత బలోపేతం చేస్తాం.

– యార్వాలా గంగాధర్, ఫౌండేషన్ సభ్యులు

ఓటరు లిస్ట్‌లో పొరపాట్లు ఉండొద్దు

- స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి
- భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు



ఓటరు జాబితా వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఓటరు జాబితాను పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. మోపాల్ మండలకేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌తోపాటు ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలను శనివారం రాత్రి ఆయన సందర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పోలింగ్ సామగ్రిని పరిశీలించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

అనంతరం తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సరితతో మాట్లాడి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మోపాల్‌లోని బీసీ బాలుర హాస్టల్, ముదక్‌పల్లిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహాన్ని కలెక్టర్ తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. రాత్రి భోజనంలో అందించిన ఆహా ర పదార్థాలు మెనూకు అనుగుణంగా ఉన్నాయా, భోజనం సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్, కిచెన్, స్టోర్‌రూమ్‌లను తనిఖీ చేసి వార్డెన్ వద్ద వివరాలు ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్‌ఐ రాజేశ్వర్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఎస్‌ఈ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

ఫైర్ హుషార్

- అగ్నిమాపకశాఖకు ఆధునిక పరికరాలు
- ఎనిమిది మందిని ఒకేసారి రక్షించే రెస్క్యూ బోట్
- ఉమ్మడి జిల్లాలోని 20 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



ఇన్‌ఫ్లటబుల్ రెస్క్యూ బోట్లపై శిక్షణ పొందుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

ఖలీల్‌వాడి: ఆపదలో ఆదుకునే అగ్నిమాపకశాఖకు అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే రెస్క్యూ, రిమోట్ బోట్లు ఆపరేటింగ్ చేసే విధానంపై జిల్లా కేంద్రంలోని రఘునాథ చెరువులో ప్రతి శుక్రవారం సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. నిజామాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శంకర్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల్లోని 12 ఫైర్‌స్టేషన్‌లకు చెందిన 20 మంది సిబ్బందికి శిక్షణ కొనసాగుతోంది. శిక్షణ పొందుతున్న వారిలో గాంధారి, భీమ్‌గల్ ఫైర్ స్టేషన్‌ల అవుట్ సోర్సింగ్ సిబ్బంది సైతం ఉన్నారు.

రిమోట్ బోట్ ప్రత్యేకం

సరికొత్తగా రిమోట్ బోటును అందుబాటులోకి తెచ్చి అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఒకప్పుడు నీటిలో పడినవారిని కాపాడేందుకు పడవ, బోట్‌ను ఉపయోగించే వారు.

ఇప్పుడు నీటిలో చిక్కుకున్న వారివద్దకు ఒడ్డునే ఉండి రిమోట్ సాయంతో బోట్‌ను పంపించి కాపాడొచ్చు. ఒడ్డున ఉండి 800 మీటర్ల దూరం వరకు నీటిలో బోట్‌ను పంపించి బాధితులను రక్షించే అవకాశముంది.

రెస్క్యూ బోటులో రిస్క్ చేయడం

శిక్షణలో అతి ముఖ్యమైనది రెస్క్యూబోట్ ఆపరేటింగ్. ప్రస్తుతం సిబ్బంది శిక్షణ పొందుతున్న బోటును ఎక్కువ మంది బాధితులను, ఎక్కువ బరువును మోసే విధంగా రూపొందించారు. దీనిద్వారా ఒకేసారి 8 నుంచి 10 మందిని కాపాడొచ్చు. అవుట్ బోర్డ్ మోటార్‌ను బిగించి రెస్క్యూబోట్ నడుపుతారు. ప్రస్తుతం 40 హెచ్‌పీ మోటారు వాడుతున్నారు.

ప్రతి శుక్రవారం శిక్షణ

జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ చెరువులో ఉమ్మడి జిల్లాకు చెందిన 20మంది అగ్నిమాపక సిబ్బందికి ప్రతి శుక్రవారం శిక్షణ ఇస్తున్నాం. ఇన్‌ఫ్లటబుల్ రెస్క్యూ, రిమోట్ బోట్లు వాడి వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో శిక్షణ ఇచ్చాం. వరదలు, వినాయక నిమజ్జనం వంటి సందర్భాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల సేవలను ఉపయోగిస్తాం.

– పరమేశ్వర్, జిల్లా ఫైర్ అధికారి, నిజామాబాద్

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

- రూ.కోట్ల లావాదేవీలకు సంబంధించిన చెక్కులు..
- ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం
- రూ.1.21 కోట్ల నగదు సీజ్
- శనివారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు తనిఖీలు



ఒకటో టౌన్ పరిధిలో తనిఖీలు చేస్తున్న ఎస్‌హెచ్‌వో రఘుపతి, సిబ్బంది

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్ డివిజన్‌లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం తెల్లవారుజాము నుంచి దాడులు చేశా రు. అనుమతులు, రిజిస్ట్రేషన్‌లు లేకుండా ఫైనాన్స్‌లు, వడ్డీ వ్యాపారం చేస్తున్నారనే ఫిర్యాదుల నేప థ్యంలో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వడ్డీ వ్యాపారుల, ఫైనాన్షియర్ల ఇళ్లు, కార్యాలయా ల్లో తనిఖీలు చేపట్టారు. సామాన్యుల అవసరాన్ని ఆసరా చేసుకుని అధిక వడ్డీ వ సూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. నిజామాబాద్ డివిజన్‌లోని ఓ పో లీస్‌స్టేషన్ పరిధిలోని ఒక్క గ్రామంలోనే సు మారు రూ.2 కోట్ల లావాదేవీలకు సంబంధించిన ప్రామిసరీ నోట్లు లభించినట్లు ప్రచారంలో ఉంది. అలాగే నిజామాబాద్‌లో 99, ఆర్మూర్‌లో 5 ల్యాండ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్: బోధన్‌లోని ఆరు ఫైనాన్స్ కార్యాలయాలపై దాడులు చేసి ప్రామిసరీ నోట్లు, రసీదులు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న చెక్కులు, ప్రామిసరీ నోట్లు

డివిజన్	చెక్కులు	విలువ
నిజామాబాద్	137	రూ.10,14,11,370
ఆర్మూర్	62	రూ.30,36,000
	ప్రామిసరీ నోట్లు	విలువ
నిజామాబాద్	170	రూ.7,10,73,870
ఆర్మూర్	324	రూ.4,97,10,000
	బాండ్లు	
నిజామాబాద్	00	00
ఆర్మూర్	49	రూ.1,85,30,500

నిజామాబాద్‌లో స్వాధీనం చేసుకున్న నగదు రూ.1,21,92,750

మోసానికి గేట్‌వే!

- యాప్ ద్వారా స్వలింగ సంపర్కులకు వల
- నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్
- రూ. లక్షలు వసూలు చేస్తున్న ముఠా
- ఇప్పటికే ఐదుగురు నిందితుల అరెస్ట్
- బాధితుల గురించి ఆరా తీస్తున్న పోలీసులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గే యాప్స్ ద్వారా స్వలింగ సంపర్కులను ఆకర్షించి తమ దగ్గరకి రప్పించుకుని వారికి తెలియకుండా నగ్న వీడియో లు తీసి బ్లాక్ మెయిలింగ్ దందా నడిపిన ముఠా సభ్యులు ఐదుగురిని ఈనెల 2న కామారెడ్డిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే వీరిపై ఇప్పటికే 11 కేసులు నమోదవగా.. బాధితులు నలభై మంది దాకా బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇంకా వందల్లో ఉంటారని సమాచారం. బాధితుల్లో కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలకు చెందిన వారూ ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా కొందరు బాధితులు తమ విషయం బయటకు పొక్కితే పరువు పోతుందన్న ఉద్దేశంతో బయటకు రావడం లేదు. ఈ కేసులో స్థానిక పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న ముఠా సభ్యుల కస్టడీ కోసం పిటిషన్ వేసి వారిని మరింత లోతుగా విచారించే అవకాశాలున్నాయి.

ముందుగా బాధితుల వివరాలు సేకరించి వారి ద్వారా ఫిర్యాదులు తీసుకుని ఎంత నష్టపోయారన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు యాభై మంది వరకు బాధితులను గుర్తించినట్లు సమాచారం. బాధితులు ఇంకా వందల్లో ఉంటారని భావిస్తున్నారు. కేసును మరింత లోతుగా విచారించేందుకు అరెస్టయిన వ్యక్తులను కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

క్లుప్తంగా

పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో లోవోల్టేజీ దూరం

● ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌రావు



వేల్పూర్: మోతె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామంలో కరెంటు సమస్యలు తీరుతాయని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్‌రావు పేర్కొన్నారు. శనివారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఉన్న రెండు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లు గ్రామంలో పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు సరిపోకపోవడంతో అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు కోరిన అదనపు ఫీడర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్ఈ, అధికారులను వీడీసీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్మూర్ డీఈ రాజేశ్వర్‌రావు, భీమ్‌గల్ ఏడీఈ వినోద్ కుమార్, వేల్పూర్ ఏఈ యశ్వంత్‌రావు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ కోర్సులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 28 నుంచి టైలరింగ్ (31 రోజులు), మగ్గం వర్క్ (31 రోజులు), సెప్టెంబర్ 5 నుంచి బ్యూటీపార్లర్ (35 రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. శిక్షణతోపాటు భోజన, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఉన్న గ్రామీణ ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461-295428 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సిర్నాపల్లిలో అగ్ని ప్రమాదం

● తప్పిన ప్రాణాపాయం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఇందల్వాయి: సిర్నాపల్లి గ్రామంలో మరకల రాజు ఇంట్లో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు దుబాయిలో ఉండగా అతని భార్య, తల్లి ఇంట్లో ఉంటున్నారు. ఉదయం ఒక్కసారిగా చెలరేగిన మంటలను గమనించిన స్థానికులు గన్నారం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని అగ్నిమాపక శాఖ అధికారి విక్రమ్ తెలిపారు. ప్రమాదంలో నిత్యావసర సరుకులతోపాటు రూ.1.50లక్షల నగదు, సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు కాలిబూడిదైనట్లు ఆర్ఐ మోహన్ తెలిపారు.

పట్టు పట్టి.. పీహెచ్‌డీ సాధించి..

- కుటుంబం, ఉద్యోగ బాధ్యతలు మోస్తూనే పరిశోధనలు
- సమాజానికి మేలు చేసే అంశాలతో..
- డాక్టరేట్ పట్టా అందుకున్న మహిళా'మణులు'

ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూ.. మరోవైపు ఉద్యోగం చేస్తూ.. ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి విజయం సాధించారు ఆ మహిళామణులు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు తెలంగాణ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో తాము ఎంచుకున్న అంశంపై పరిశోధన చేశారు. ఇటీవల యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. - సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



'పోక్సో'పై బాలికల అవగాహన స్థాయి



కామారెడ్డి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో)గా పనిచేస్తున్న స్రవంతి తెయూ లో పీహెచ్‌డీ చేశారు. పోక్సో చట్టంపై జిల్లా లోని కౌమార బాలబాలికలకున్న అవగాహన స్థాయిని అధ్యయనం చేసి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ సోషల్ వర్క్ విభాగంలో విజయ్‌కుమార్ శర్మ పర్యవేక్షణ లో ఆమె పరిశోధన సాగింది. ఇటీవల జరిగిన తెయూ స్నాతకోత్సవంలో ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

మహిళలపై సీరియల్స్ ప్రభావం..



వామపక్ష విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నత విద్యాభ్యాసం చేసిన పిట్ల సరిత.. తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె 'మహిళలపై టెలివిజన్ సీరియల్స్ ప్రభావం' అంశంపై పరిశోధన చేశారు. ఇటీవలే డాక్టరేట్ సాధించారు.

వ్యవసాయంపై ప్రపంచీకరణ..



నిజామాబాద్‌కు చెందిన ఎస్.సౌందర్య ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ పీజీ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం -తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలపై ఒక అధ్యయనం అన్న అంశంపై పరిశోధన చేశారు. ఇటీవలే డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

మొక్కజొన్న ఎదుగుదల..



నిజామాబాద్ జిల్లా మునిపల్లిలోని మహాత్మా జ్యోతీబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అనూష పరుచూరి.. మొక్కజొన్నపై బ్రాసినో స్టెరాయిడ్స్, కేడ్మియం లవణీయత చూపే ప్రభావం అంశంపై పరిశోధన చేశారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ, చదువుకుంటూ ఉన్నతంగా ఎదుగుతున్నారు.

పెట్టుబడి అవకాశాలు, సవాళ్లు..



తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో నిజామాబాద్ జిల్లా దాస్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.సరిత.. 'తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, సవాళ్లు, ఒక అధ్యయనం' అన్న అంశంపై పరిశోధన చేశారు. తెయూ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో పరిశోధన సాగింది. ఇటీవల పట్టా అందుకున్నారు.

తెలంగాణ నవలా రచయిత్రులు..



తెయూ సౌత్ క్యాంపస్‌లో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్న సయ్యద్ అఫ్రీన్ బేగం మాతృభాష ఉర్దూ. అయినా ఆమె తెలుగులో మంచి ప్రావీణ్యం కలిగి ఉన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన విభాగంలో 'తెలంగాణ నవలా రచయిత్రులు.. ఒక పరిశీలన' అన్న అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు.

సాహిత్యం-శ్రామిక జీవన చిత్రణ..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కాలేజీలో తెలుగు విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఎస్.శమంత తెలుగు సాహిత్యంపై పట్టు సాధించారు. నిరంతర అధ్యయనం ద్వారా తాను ఎంచుకున్న రంగంలో రాణిస్తున్నారు. తెలంగాణ సాహిత్యం-శ్రామిక జీవన చిత్రణ అన్న అంశంపై తెయూలో పీహెచ్‌డీ చేశారు.

వృద్ధుల రక్షణకో చట్టం

మీకు తెలుసా?



ఎల్లారెడ్డి: చిన్ననాటి నుంచి అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్య సమయంలో పిల్లలు భారంగా భావించి వదిలేస్తున్నారు. ఇలా దగ్గరి వాళ్లతో దగాపడ్డ తల్లిదండ్రులకు వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం -2007 రక్షణ కల్పిస్తోంది.

- చట్టం ప్రకారం పిల్లలు తమ తల్లిదండ్రులను పోషించేందుకు, వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- పిల్లలు నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రులు వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవచ్చు. వారి నుంచి భరణం లేదా సంరక్షణావ్యయం పొందేందుకు న్యాయస్థానం తలుపుతట్టవచ్చు.
- తల్లిదండ్రులకు ఆహారం, బస, దుస్తులు, వైద్య సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలను కచ్చితంగా సమకూర్చాలి.
- పిల్లలు మానసికంగా లేదా శారీరకంగా హింసిస్తే కోర్టు నేరంగా పరిగణించి తల్లిదండ్రులకు న్యాయం చేస్తుంది. తల్లిదండ్రులను పోషించడంలో విఫలమైతే కోర్టు పిల్లలకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తుంది.
- నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధుల కోసం కలెక్టర్, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలలో ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బాధితులు తెల్లకాగితంపై తమ సమస్యను వివరిస్తూ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారణ జరిపి వారికి పోషణ, సంక్షేమం వచ్చేలా చర్యలు తీసుకుంటారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

డీఏవో మేకల గోవింద్



రైతులతో మాట్లాడుతున్న డీఏవో గోవింద్

నిజామాబాద్ రూరల్: ఉద్యాన శాఖ నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్ పామ్(ఎన్ఎంఈవో-ఓపీ) పథకంలో భాగంగా ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవింద్ అన్నారు. మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట కొనుగోలు చట్ట పరిధిలో జరుగుతుందన్నారు. మొక్కలు నాటిన తర్వాత 4వ సంవత్సరం నుంచి పంట దిగుబడి మొదలై 35 నుంచి 40 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4,200 చొప్పున ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందజేస్తుందన్నారు. ఆయిల్ పామ్ మొక్కలకు 90 శాతం, బిందు సేద్య పరికరాలకు 80-100శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయిల్ పామ్ సాగులో మెలకువలను మండల ఉద్యానశాఖాధికారి రోహిత్ తెలిపారు. ఆసక్తి గల రైతులు ఏఈవోలకు డీడీలు అందజేయాలని మండల వ్యవసాయాధికారి హీరా జాదవ్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు జ్ఞానేశ్వర్, స్వాతిలత పాల్గొన్నారు.

గోదావరిలోకి కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతుండటంతో ఎస్సారెస్పీ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. 16 గేట్ల ద్వారా 49,250 క్యూసెక్కుల నీరు పోతుండగా, 78వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వరద కాలువ ద్వారా 20 వేలు, కాకతీయ కాలువకు 3500, ఎస్కేప్ గేట్ల ద్వారా 4500, సరస్వతి కాలువకు 500, లక్ష్మి కాలువకు 150, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 651 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.70(79.26 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



పెరిగిన విద్యుదుత్పత్తి..

ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి మరింత పెరిగింది. నాలుగు టర్బాయిన్ల ద్వారా 36.4 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 8.97 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి పార్శి అశోక్

డీఈవో అశోక్

ఆర్మూర్: దివ్యాంగ విద్యార్థులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉంటాయని జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ పేర్కొన్నారు. దివ్యాంగుల సేవ ను తల్లిదండ్రులు, సహిత విద్యావిభాగం ఉద్యోగులు బరువుగా భావించకుండా బాధ్యతగా భావించాలని సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని సీఎస్ఐ కాంపౌండ్‌లో ఉన్న హెచ్‌పీడీ బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యాశాఖ, సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగం, అలీంకో సంయుక్తంగా దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల కోసం లబ్ధిదారుల గుర్తింపు శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్ దివ్యాంగుల అవసరాన్ని గుర్తించి సహాయ ఉపకరణాలు అందజేస్తున్న అలీంకోను అభినందించారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గతేడాది జిల్లా వ్యాప్తంగా 294 మంది దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫిర్దౌస్ ఫాతిమా, బధిరుల పాఠశాల మేనేజర్ సువర్ణ కిరీటి, ప్రిన్సిపల్ శాంతమూర్తి, అలీంకో నిపుణులు రుక్మిణి, ఓం ద్వివేది, నర్సింగ్ ఆఫీసర్ రజిత, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు. అంతకుముందు 250 మందిని పరీక్షించి అందులో 150 మందిని అర్హులుగా గుర్తించారు.

సోషల్‌వర్క్‌లో ప్రగతికి డాక్టరేట్



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని సోషల్‌వర్క్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ స్కాలర్ ప్రగతికి శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ రాజేశ్వరీ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఆటిట్యూడ్ ఎమాంగ్ స్టూడెంట్స్ టువర్డ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ కేరీర్ ప్లానింగ్ ఇన్ కేజీబీవీస్ నిజామాబాద్' అనే అంశంపై సీహెచ్. ప్రగతి పరిశోధన చేసింది. ప్రగతి నిజామాబాద్ సోషల్ వేల్ఫేర్ గురుకుల కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ ఫ్రాన్సిస్, తెయూ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, సోషల్‌వర్క్ హెచ్‌వోడీ అంజయ్య, గైడ్ సూపర్‌వైజర్ రాజేశ్వరీ పాల్గొన్నారు.

ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ కోచ్‌గా ఎతెసామొద్దీన్

నిజామాబాద్‌నాగారం: బాక్సింగ్ చాంపియన్ షిప్ కోచ్‌గా జిల్లాకు చెందిన ఎతెసామొద్దీన్ వ్యవహరించనున్నారు. సెప్టెంబర్ 4 నుంచి 14 వరకు జరిగే వరల్డ్ ఉమెన్ బాక్సింగ్ చాంపియన్‌కు కోచ్‌గా వెళుతున్నారు. ఇది వరకే రెండు టోర్నీలకు కోచ్‌గా వెళ్లిన ఆయన దేశానికి పతకాలు తీసుకరావడంతో కీలకపాత్ర పోషించారు.

కమిటీల ఆధ్వర్యంలోనే పనులు



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేకాధికారి దాసరి ఒడ్డెన్న

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియట్ విద్య బలోపేతం కోసం ప్రభుత్వం జూనియర్ కళాశాలలకు కేటాయించిన నిధులను అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలోనే ఖర్చు చేయాలని ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఒడ్డెన్న మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరమ్మతులు, అభివద్ధి పనులు చేపట్టేందుకు ఇంటర్ బోర్డు కేటాయించిన నిధుల కోసం అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు. బోర్డు కమిషనర్ ఆదేశాల కళాశాలల్లో విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా ఆన్‌లైన్ అటెన్డెన్స్ విధానం అమలు చేయాలని, విద్యార్థులు కళాశాలలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యా అకడమిక్ సెల్ ప్రతినిధి నర్సయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కళాశాలల తనిఖీ

ఒడ్డెన్నతోపాటు రవికుమార్ డిచ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిజామాబాద్ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకడమిక్ అంశాలను సమీక్షించారు.

తప్పిన ఇంటర్నెట్ తిప్పలు

● 80 రైతు వేదికల్లో మోడెంల ఏర్పాటు



రైతు వేదికలో పెట్టిన ఇంటర్నెట్ మోడెం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మొత్తం 106 రైతు వేదికలు ఉండగా ప్రభుత్వం 80 చోట్ల వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించింది. ఐతే, ఇంటర్నెట్ సేవలు లేకపోవడంతో ఏఈవో, ఏవోలు మొబైల్ ఫోన్ నుంచి హాట్‌స్పాట్ ద్వారా ప్రతి మంగళవారం 'రైతునేస్తం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాదాపు రెండున్నర గంటలపాటు జరిగే వీడి యో కాన్ఫరెన్స్‌ను కొనసాగించాలంటే మొబైల్ ఫోన్లలో డేటా సరిపోయేది కాదు. ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించింది. వీడియో కాన్ఫరెన్స్ ఉన్న రైతు వేదికల్లో స్థానిక నెట్‌వర్క్‌కు అనుగుణంగా ఇంటర్నెట్ మోడెంలను పెట్టించింది. కాగా, రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే బాగుంటుందని ఏఈవోలు కోరుతున్నారు.

రేపు జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

సుభాష్‌నగర్: నగర శివారులోని శ్రీ రామగార్డెన్‌లో సోమవారం నిర్వహించే జిల్లా బూత్‌స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి జిల్లాకు వస్తున్న రాంచందర్‌రావుకు ఘన స్వాగతం పలికేలా నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆయనకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద స్వాగతం పలకనున్నారు. అనంతరం కంఠేశ్వర్ ఆలయంలో పూజలు చేసి సమావేశ ప్రాంగణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఆత్మీయ సమ్మేళనం అనంతరం బీజేపీ కార్యాలయంలో జరిగే జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అర్వింద్ ధర్మపురితోపాటు ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి హాజరుకానున్నారు.

క్రైం కార్నర్

సీపీ ఎదుట 13 మంది బైండోవర్



బోధన్‌టౌన్(బోధన్): వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, దుర్గామాత ఉత్సవాల సందర్భంగా బోధన్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన 13 మందిని అదనపు జిల్లా మెజిస్ట్రేట్, సీపీ సాయిచైతన్య ఎదుట శనివారం బైండోవర్ చేశారు. వచ్చే ఆరు నెలలపాటు సత్ప్రవర్తన కలిగించేందుకు సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు సీపీ తెలిపారు. డీజే యజమానులు రూ.2 లక్షలు, డీజే ఆపరేటర్లు రూ.50 వేలు, ట్రబుల్ మాంగర్స్ రూ.లక్ష పూచీకత్తు చెల్లించినట్లు పేర్కొన్నారు. బైండోవర్ అయినవారు మళ్లీ నేరాలకు పాల్పడితే పూచీకత్తు డబ్బులను జప్తు చేస్తామన్నారు.

విద్యార్థిని ఇంటికి చేర్చిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్: హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం ఇష్టంలేక బయటికి వచ్చిన విద్యార్థిని పోలీసులు క్షేమంగా ఇంటికి చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాల్కొండ మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి బాల్కొండలోని వసతిగృహంలో ఉంటూ చదువుతున్నాడు. శనివారం ఇంటి నుంచి బయల్దేరిన విద్యార్థి హాస్టల్‌కు వెళ్లకుండా పెర్కిట్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్‌లో రోదిస్తూ కూర్చున్న విద్యార్థిని గమనించిన స్థానికులు ఆరా తీయగా బస్సు కిందపడి ఆత్మహత్యకు పాల్పడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సదరు విద్యార్థికి కౌన్సెలింగ్ చేసి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. సమయానికి బస్టాండ్‌కు చేరుకొని విద్యార్థి అఘాయిత్యానికి పాల్పడకుండా కాపాడిన శాంతికుమార్, దినేశ్‌లను ఎస్‌హెచ్‌వో అభినందించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో ఓ వివాహిత శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె పుష్ప(40) భర్త కిషన్, అతని కుటుంబసభ్యుల వేధింపులకు గురవుతూ వస్తుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది పుష్ప ఆత్మహత్యకు పాల్పడింది. భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం భర్త బతుకుదెరువు నిమిత్తం దుబాయిలో పనిచేస్తున్నాడు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతి

ఇందల్వాయి: ఇందల్వాయి రైల్వేగేటు పక్కన ఉన్న రైల్వే వంతెనపై శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని, మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలిని గుర్తిస్తే 8712658591, 8712568424 నెంబర్లలో రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

లోన్ మంజూరు పేరిట సైబర్ మోసం

డిచ్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన వ్యాపారి సైబర్ మోసానికి గురయ్యారు. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అమీర్ అలీకి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఎలక్ట్రికల్ షాపు ఉంది. ఈ నెల 18న ఉదయం గుర్తు తెలియని నెంబర్ నుంచి అమీర్ అలీకి కాల్ వచ్చింది. తాము శ్రీరాం ఫైనాన్స్ నుంచి మాట్లాడుతున్నామని, లోన్ కావాలంటే ఇస్తామని ఆధార్, పాన్‌కార్డు పంపించాలని చెప్పగా అమీర్ అలీ వారికి పంపించాడు. అనంతరం మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని అడుగగా వారికి చెప్పాడు. వెంటనే అతడి బ్యాంకు ఖాతా నుంచి దశల వారీగా రూ.97,999 లు పోయాయి. గమనించిన బాధితుడు జిల్లా కేంద్రంలోని శ్రీరాం ఫైనాన్స్‌కు వెళ్లి అడుగగా తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దీంతో మోసపోయాయని గ్రహించిన బాధితుడు శనివారం డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

రెండేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి

● జిల్లా ఆస్పత్రికి తరలింపు



గాయపడ్డ చిన్నారి

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో శనివారం అల్లెపు అక్షర అనే రెండేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలై పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నారి అక్షప మధ్యాహ్నం తన ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. కుక్క దాడి చేస్తుండగా గమనించిన చిన్నారి అమ్మమ్మ కర్రతో ఎంత తరిమినా వదలకుండా చిన్నారిని కరవడంతో ముఖం, చెంప, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్సులో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్మూర్‌లో ఒకరికి..



కుక్కల దాడిలో గాయపడ్డ శ్రీనివాస్‌రావు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉదయం వాకింగ్‌కు వెళుతున్న శ్రీనివాస్‌రావు అనే వ్యక్తిని కుక్కలు వెంబడించాయి. దీంతో ఆయన జారిపడటంతో కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లగా ఎడమకాలు విరిగినట్లు బాధితుడు తెలిపారు.

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు..

- అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ
- మద్యం మత్తులో బండరాయితో దాడి.. భార్య మృతి



సాయవ్వ(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కలకాలం వెన్నంటి ఉండి కష్టసుఖాల్లో తోడుండాల్సిన భర్తే కాలయముడయ్యాడు. భార్యను బండరాయితో మోది హతమార్చిన ఘటన మండల కేంద్రంలోని జ్యోతినగర్ కాలనీలో శనివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతినగర్ కాలనీకి చెందిన చిందం లక్ష్మి అలియాస్ లింగవ్వ(40) వంట చేస్తుండగా భర్త రవి అతిగా మద్యం సేవించి గొడవపడ్డాడు. ఈ క్రమంలో భార్య, భర్తపై దాడి చేసింది. మద్యం మత్తులో ఉన్న రవి బండరాయితో తలపై దాడి చేయగా లింగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, అనుమానంతోనే ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవని కాలనీవాసులు తెలిపారు. మృతురాలికి కొడుకులు సురేశ్, మహేశ్ ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై పుష్పరాజ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.